క్లుప్తంగా

వృద్ధురాలి పింఛన్ స్వాహా!


వృద్ధురాలు ఎల్లమ్మ

తొర్రూరు: వృద్ధురాలికి తెలియకుండానే పింఛన్ మొత్తం స్వాహా చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మాటేడు శివారు కిష్టాపురం గ్రామానికి చెందిన 77ఏళ్ల వృద్ధురాలు నకిరెకంటి ఎల్లమ్మ జూన్ పింఛన్ నిమిత్తం గ్రామ పరిధిలోని పోస్టాఫీస్‌కు వెళ్లగా అప్పటికే రూ.2,016 తీసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. పింఛన్ తీసుకున్న స్లిప్ అందించారు. అవాక్కైన వృద్ధురాలు తనకు తెలియకుండానే పింఛన్ ఎవరో తీసుకున్నారని పేర్కొంటూ ఎంపీడీఓ సిలార్ సాహెబ్‌కు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సైతం ఇలాగే పింఛన్ కాజేశారని వృద్ధురాలు పేర్కొంది. ఘటనపై స్పందించిన ఎంపీడీఓ.. మాటేడు పంచాయతీ కార్యదర్శి నగేష్‌కు ఫోన్ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పింఛన్ డబ్బులు వచ్చేలా కృషి చేస్తానని వృద్ధురాలికి హామీనిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్య

గూడూరు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా గుర్తించిందని, ప్రతీ ఒక్కరు అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ బోధించాలని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండల కేంద్రంలోని వడ్డెరగూడెం రైతు వేదికలో గురువారం గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య, ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యాబోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎర్ల నరేష్‌రెడ్డి

గూడూరు: ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ నెక్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు రెడ్డిపల్లికి చెందిన ఎర్ల నరేష్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, జిల్లా నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డోర్నకల్/కురవి: డోర్నకల్, చిన్నగూడూరు, మరిపెడ పరిధిలోని దాశరథి, కురవి మండల కేంద్రంలోని వీరభద్ర మహిళా రైతు ఉత్పత్తిదారు కంపెనీ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈఓ)గా తాత్కాలిక పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కురవి ఎఫ్‌పీసీ చైర్మన్ బి.పద్మ, ఏపీఎం డి.సత్యనారాయణ, డోర్నకల్ డోర్నకల్ ఐకేపీ ఏపీఎం శంకర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ డిప్లొమా, కంప్యూటర్‌పై అవగాహ న కలిగి 21నుంచి 35ఏళ్ల లోపు ఉన్న వ్యక్తులు అర్హులని తెలిపారు. కురవి పరిధిలోని అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోగా కురవిలోని గాయత్రి మండల సమాఖ్య కార్యాలయంలో, డోర్నకల్, చిన్నగూడురు, మరిపెడ పరిధిలోని అభ్యర్థులు ఈ నెల 26లోగా మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

‘నీట్’ నిందితులను శిక్షించాలి

గార్ల: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ గురువారం పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ పిలుపులో భాగంగా నేడు మండల కేంద్రాల్లో చేపట్టే నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, శంషాద్‌బేగం, యాకూబ్‌పాషా, బాబూలాల్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

లైసెన్స్ రెన్యువల్ చేయాలి

డోర్నకల్: మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ నరేష్‌రెడ్డి దుకాణ యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 22దుకాణాలను 2018లో వ్యాపారులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. నాటి నుంచి వ్యాపారులు దుకాణాల లైసెన్స్ రెన్యువల్ చేయించుకోనందున వ్యాపారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. 2021, 2024 వాయిదాలకు సంబంధించి లైసెన్స్ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. భారీ జరిమానాలు, రుసుం తాము చెల్లించలేమని వ్యా పారులు కోరగా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

దోర్నకల్: మాత్రలు వేస్తున్న డాక్టర్ సాధ్విజ



దంతాలపల్లి: మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ వివేక్‌రామ్



కురవిలో..



- విద్యాసంస్థల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని పలువురు వైద్యులు, ఉపాధ్యాయులు సూచించారు. గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పలుచోట్ల ప్రతినిధులు, అధికారులు పాల్గొని మాత్రలువేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మరిపెడలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్


చిన్నగూడూరులో..


గార్ల ఆశ్రమ పాఠశాలలో..


గూడూరు గిరిజన బాలికల ఆశ్రమంలో..


పెద్దవంగర: వడ్డెకొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..


కేసముద్రంలో..


మహబూబాబాద్ అర్బన్: గుమ్ముడూరు పాఠశాలలో..

ఆవుదూడను బస్సుకు కట్టేసి నిరసన

- దూడను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- రూ.1000 జరిమానా కట్టిన డ్రైవర్


బస్సు ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజనులు

మరిపెడ రూరల్: ఆవుదూడను బస్సు ఢీ కొట్టిందని బస్సుకు కట్టేసి నిరసన తెలిపారు. ఈ సంఘటన మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజి వద్ద వరంగల్–ఖమ్మం 563 హైవేపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపేట స్టేజికి చెందిన రైతు గుగులోతు హేమ ఆవు దూడ రోడ్డు దాటుతున్న క్రమంలో ఖమ్మం నుంచి వరంగల్ వైపుగా వెళ్తున్న హనుమకొండ ఎక్స్‌ప్రెస్ బస్ ఢీ కొట్టింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేసినప్పటికీ ఆవు దూడకు నెమ్మదిగా బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆవుదూడకు ముక్కు, గదమ కింది భాగంలో గాయాలయ్యాయి. సడన్ బ్రేక్ వేయడంతో బస్సులోని ప్రయాణికులు పలువురు గాయపడ్డారు. ఈక్రమంలో రోడ్డుపైకి వచ్చిన గిరిజన రైతులు గాయాలైన ఆవుదూడను బస్సుకు కట్టేసి నిరసన తెలిపారు. బస్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లన ఆవుదూడకు గాయాలయ్యాయిన ఆరోపించారు. అరగంట పాటు బస్సును రోడ్డుపై నిలిపారు. దీంతో చేసేది లేక బస్సు డ్రైవర్ రూ.1,000 జరిమానా కట్టడంతో నిరసన విరమించారు.

నిషేధిత ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు


నిషేధిత మందులను చూపుతున్న అధికారులు

దంతాలపల్లి: ప్రభుత్వ నిషేధిత కలుపు నివారణ మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మంజూఖాన్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో శ్రీ ఆగ్రోస్ పేరుతో నడుస్తున్న ఎరువుల షాప్‌లో ఎస్సై కరుణాకర్‌తో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 26లీటర్ల ప్రభుత్వ నిషేధిత కలుపు నివారణ మందు (గ్లైఫోసెట్) స్వాధీనం చేసుకున్నారు. చర్యల నిమిత్తం ఈ నిషేధిత ఎరువులపై ఉన్నత అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. కాగా మండలంలోని పలు గ్రామాల రైతులు ఈ షాపు యజమానికి దంతాలపల్లి మండలకేంద్రంలో మణికంఠ పేరుతో చాలా సంవత్సరాల క్రితం నుంచి మరో షాపు ఉందని, గతంలో మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన వారి కనుసన్నల్లో ఈ మందులు అమ్మేవారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు దీక్షిత్‌కుమార్, శిరీష, ప్రకాష్‌రెడ్డి, మధు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

కేసముద్రం: అమీనాపురం గ్రామంలోని భూనీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి


దంతాలపల్లి: వినతిపత్రం స్వీకరిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: గిరిజనుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బోడ రమేశ్ నాయక్ కోరారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ మానుకోటకు వచ్చిన సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు గురువారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడ రమేశ్ మాట్లాడుతూ.. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, మెడికల్ కళాశాల గిరిజన భూ బాధితులకు న్యాయం చేయాలన్నారు. 70ఎకరాల భూ కబ్జాలకు పాల్పడిన మాజీ ప్రజాప్రతినిధులు, వారి బినామీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ గిరిజన ఉద్యోగస్తులపై జాతి వివక్షత చూపుతున్న డీఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీను, బానోత్ అనసూర్య, రాధ, పద్మ, మంగ పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా కృషి చేస్తా

దంతాలపల్లి: మండలం బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద సర్వే నంబర్ 352లో ఇళ్ల స్థలాలు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్త చిన్నాల ప్రవీణ్ ఇంట్లో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మదన్, మహేష్ గౌడ్, సందెల శ్రీను, అల్లం సాయి, మురళి, సారెడ్డి రాణిరెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలకు వరద ముప్పు


గతేడాది పాఠశాల ఆవరణలో నిలిచిన వరదనీరు(ఫైల్)

డోర్నకల్: డోర్నకల్ బైపాస్ రోడ్డులోని తెలంగాణ1 మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలకు వరద ముప్పు పొంచి ఉంది. బైపాస్ రోడ్డు సమీపంలోని కృష్ణవేణి పాఠశాలలో గతేడాది మైనార్టీ గురుకుల పాఠశాలను ప్రారంభించారు. గతేడాది జూలై 25న భారీ వర్షాలతో వరద పోటెత్తి పాఠశాల ఆవరణతోపాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలు నీట మునిగాయి. పాఠశాల సమీపంలోని ఆర్ అండ్ బీ రహదారి కింద ఏర్పాటు చేసిన కల్వర్టు, రోడ్డుకు అవతల కాలువ పక్కన ప్రహరీ నిర్మించడంతో కాల్వ మూసుకుపోయి వరదనీరు చెరువుకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో వరద పాఠశాలను చుట్టుముట్టింది. ఈక్రమంలో విద్యార్థులు వరదనీటితో మూడు రోజుల పాటు నరకయాతన అనుభవించారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పట్టణంలోని యాదవనగర్ నుంచి వరద ప్రవాహం మైనార్టీ పాఠశాల భవనం పక్క ఆర్అండ్‌బీ రోడ్డు కింద నుంచి పెద్ద చెరువుకు వెళ్తుంది. రోడ్డు కింద కల్వర్టుతోపాటు ఇరుపక్కలా కాల్వలు మూసుకుపోవడంతో పాఠశాల భవనం చుట్టూ వరదనీరు నిలిచే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి పాఠశాల భవనం ఎదుట సిమెంట్ రోడ్డు తోపాటు సైడు కాల్వ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దళితులకు న్యాయం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: దళితులకు చెందాల్సిన భూదాన్ భూములను వారికి అప్పగించి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కన్వీనర్ గుగ్గిళ్ల పీరయ్యమాదిగ డిమాండ్ చేశారు. దళితుల భూముల ఆక్రమణపై సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూదాన్ భూముల్లో అక్రమంగా వెంచర్లు చేసి విక్రయిస్తున్నారని, వెంచర్లను తొలగించి వెంటనే లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. మాదిగలకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దుప్పెలి అనిల్‌కుమార్‌మాదిగ, శాగంటి రమేష్, పోలెపాక ఎల్లయ్య, ఇరుగు రవికుమార్, భిక్షపతి, వంగూరి వెంకటేశ్వర్లు, వెంకటేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం విద్యార్థులకు డాక్టర్ కుమార్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు స్నానం చేసి శుభ్రంగా రావాలన్నారు. భోజనం తీసుకొనేముందు చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలని చెప్పారు. సుమారు 80మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి చందన, ఉపాధ్యాయులు ప్రభావతి, దేవి, మహేశ్వర్, సరిత, మంజుల, ఆశవర్కర్‌లు హసీనా భేగం, చంద్రకళ, ఆర్పీ అనిత పాల్గొన్నారు.


బదిలీల మార్గదర్శకాలు విడుదల చేయాలి


సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

బయ్యారం: గిరిజన సంక్షేమశాఖలోని ఉపాధ్యాయుల బదిలీల మార్గదర్శకాలను విడుదల చేయాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బి.హరిసింగ్ రాథోడ్ అన్నారు. మండలంలోని ఇర్సులాపురంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకపోవటంతో గిరిజన ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తం అవుతుందన్నారు. ఇప్పటికైనా బదిలీల మార్గదర్శకాలను విడుదల చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు లాలయ్య, నాయకులు బాబు, కోటయ్య, శోభన్‌బాబు, వీరు, రవి, వీరన్న, క్రిష్ణవేణి, రాధిక, హన్మంతు, అంజయ్య, నాగేశ్వరరావు, వాలు, జనార్దన్, హనుమ పాల్గొన్నారు.

ప్రత్యక్ష పద్ధతిలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలి

నెల్లికుదురు: ప్రత్యక్ష పద్ధతిన ఉపాధ్యాయుల పదోన్నతల కౌన్సెలింగ్ నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత అన్నారు. మండలంలోని అలేరు జెడ్పీఎస్ఎస్‌లో గురువారం మండల ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ద్వారా నష్టం జరిగిందని ఆరోపించారు. ఉపాధ్యాయులు ఏ సబ్జెక్టుకు పదోన్నతికి సిద్ధంగా ఉన్నారో తెల్సుకోకుండా అర్హత ఉన్న అన్ని సబ్జెక్టుల్లో కొంతమందికి పదోన్నతులు కల్పించడం వల్ల, వారు తీసుకున్న సబ్జెక్టు పోను మిగతా వాటికి మళ్లీ ఖాళీలు ఏర్పడుతున్నాయి కదా.. అనే అనుమానాన్ని ఆమె వ్యక్తం చేశా రు. ఇప్పటికైనా గుర్తించి ప్రత్యక్ష పద్ధతిన పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. భిక్షపతి, జయప్రకాష్, అనిత, స్రవంతి, హరీశ్, ఇమామ్, ఉదయ్‌కిరణ్, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

26న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్ : సారాయి, బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టబడిన వాహనాలను ఎక్సైజ్ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, డీపీఈఓ కిరణ్ ఆదేశాల మేరకు ఈ నెల 26న (బుధవారం) ఉదయం 11 గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తారని ఎక్సైజ్ సీఐ చిరంజీవి గురువారం ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు వాహన ధరలో 50శాతం డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మహబూబాబాద్ పేరుమీద డీడీ తీయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

గార్ల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గార్ల మండల సర్వసభ్య సమావేశంలో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు వైస్ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాసరావు ప్రకటించారు.

పరామర్శ

మరిపెడ రూరల్: ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు కారు డ్రైవర్ మరిపెడ మండలం నీలికుర్తి గ్రామ రెవెన్యూ పరిధిలోని పర్కజలతండాకు చెందిన బానోతు సురేష్ ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట అయూబ్ పాషా, మాజీ ఎంపీటీసీ సైదులు, మాజీ సర్పంచ్ కమిలిలాలునాయక్ ఉన్నారు.

శిథిలభవనాలు ఖాళీ చేయాలి

నెహ్రూసెంటర్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలోని ఆరు విలీన గ్రామాల్లోని శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లను ఖాళీ చేసి ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ గురువారం తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నోటీసులు జారీ

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో సర్వేనంబర్ 224లో వెలసిన నందనవనం వెంచర్‌కు ఎంపీడీఓ వివేక్‌రామ్ ఆదేశాలమేరకు నోటీసులు జారీచేసినట్లు కార్యదర్శి మల్లికార్జున్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంతో పక్కన ఉన్న వ్యవసాయ భూములకు నష్టం వచ్చే ప్రమాదం ఉందని ఫిర్యాదు అందించన్నారు. రైతులు, గ్రామప్రజలు ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ అనుమతులు వచ్చే వరకు పనులు ఆపాలని నోటీసులు జారీ చేసినట్లు కార్యదర్శి వెల్లడించారు.

డీఎఫ్ఓ కార్యాలయంలో సమీక్ష

మహబూబాబాద్ రూరల్: జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ గురువారం జిల్లాలో గల పోడు భూముల సమస్యల గురించి డీఎఫ్ఓ విశాల్ బత్తులతో సమీక్ష నిర్వహించారు. మొదటిసారి వచ్చిన హుస్సేన్‌నాయక్‌కు అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

నిరుపేదకు కృత్రిమ కాలు


ఉప్పలయ్యతో సామాజిక కార్యకర్త కిరణ్

నెల్లికుదురు: ప్రమాదంలో కాలును కోల్పోయిన నిరుపేదకు గ్రామస్తుడు ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా కృత్రిమ కాలు అందించి ఆదుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఏర్పులు ఉప్పలయ్య పొట్టకూటికోసం హైదారాబాద్ వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదానికి గురైకాలు కోల్పోయాడు. దీంతో స్వగ్రామం లక్ష్మీపురంలోనే బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతు సామాజిక కార్యకర్త సీహెచ్ కిరణ్ తన పరిచయస్తుల ద్వారా ఖమ్మంలోని ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉప్పలయ్యకు కృత్రిమ కాలు అందించాడు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడుదాం

బయ్యారం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల పరిరక్షణకై పోరాడుదామని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న పిలపునిచ్చారు. బయ్యారంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఏరియా మహాసభలో మాట్లాడారు. దేశంలోని 40 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు ఏ హక్కులు లేకుండా జీవిస్తున్నారని పేర్కొన్నారు. మహాసభలో ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, నాయకులు సత్యం, యాకయ్య, నాగరాజు, లచ్చయ్య, సాంబయ్య, వెంకన్న, పూర్ణ, శ్రీను, క్రిష్ణ, రమేష్, నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన గుడుంబా స్థావరాలపై దాడుల్లో అనంతారం గ్రామానికి చెందినా ఎడ్ల పగడయ్య, బోడగుట్ట తండా గ్రామానికి చెందిన భూక్య రమేశ్‌పై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ చిరంజీవి గురువారం తెలిపారు. 8 లీటర్ల సారాయి, రెండు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సైలు కిరీటి, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్: మల్లాయికుంట, గుర్రాలకుంట గ్రామాల్లో గురువారం మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులతో కలిసి డోర్నకల్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో సుమారు వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాల దొంగ మూల కృష్ణారెడ్డి పట్టుబడ్డట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ గురువారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట టౌన్ ఎస్సై విజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వైఎస్సార్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో బైక్‌పై వస్తున్న బయ్యారానికి చెందిన కృష్ణారెడ్డిని తనిఖీ చేయగా అతని వద్ద ఎలాంటి పత్రాలు లేవు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి గతంలో మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, బయ్యారం, డోర్నకల్, ఇల్లందు ప్రాంతాల్లో పలు దొంగతనాల కేసులో నిండితుడిగా ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం తను తీసుకొచ్చిన బైక్ సైతం దొంగిలించిందేనని అంగీకరించినట్లు అంగీకరించాడు. మహబూబాబాద్ పట్టణంలోని జ్యోతిబసు నగర్‌లో బోడ కిషన్ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను దొంగిలించినట్లు చెప్పగా.. అదుపులోకి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.